

# అక్కరకురాని చుట్టము!

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

గుమ్మటాల్లో ప్రమిదలు వూగిసలాడుతున్నాయి. ప్రమిదల్లో దీపాలు భయంతో అటూఇటూ కొట్టుకుంటున్నవి.

శాంతాదేవి తన రెండుచేతులూ ప్రమిదకు అడ్డంపెట్టి దీపాన్ని నిటారుగా నిలబెట్టింది. కాని చిరుగాలి ఆమె చేతివేళ్ళ సందుల్లోంచి దీపంవైపు తొంగి చూస్తూ వణికించేస్తోంది.

దీపాన్ని వెలిగించటంకంటె, దాన్ని కాపాడటమే చాలా కష్టం. అసలు ఓ విధంగా చూస్తే దీపాన్ని వెలిగించటం కూడా ఓ యెత్తే!

కార్తీక పౌర్ణమినాడు ప్రమిదల్లో చమురుపొయ్యటం, చముర్లో వత్తులు నానెయ్యటం, వత్తుల్లో వెలుగుచూడటం, శాంతాదేవి యెన్నో యేళ్ళ బట్టి చేస్తున్నదే.

వీధిలో తెలతెలగా కనబడుతున్న వెలుగురేఖలు చూస్తూ చూస్తుండగానే చీకట్లో కలిసిపోతున్నాయి. అట్టే వింతగా ఆలోచిస్తూ శాంతాదేవి నిరాశగా శూన్యంలోకి చూస్తోంది

చీకటి దట్టంగా అలుముకుపోతోంది. గాలిలో తేమ చల్లగా ఒంటికి తాకుతోంది. ఎక్కడో తూర్పుదిశన తెల్లటి మేఘం నల్లకప్పు వేసుకుంది. ఇట్టే తళుక్కున ఆకాశంలో మెరుపుకూడా కనిపించింది.

ఆమె మనస్సు తెగ ఆరాటపడుతోంది. గాలిలో తేలిపోతున్న ఆకాశం వంక కాసేపు చూస్తూ అట్లాగే పోర్టికోలో నిలబడిపోయింది.

మనస్సు మహా చంచలమయింది. పట్టుచిక్కటంలేదు. ఒకచోట అంతకంటె నిలవటంలేదు. అటూ ఇటూ పరుగెత్తుతున్నట్టు కనిపిస్తోంది. ఆ మనోవేగాన్ని తట్టుకోలేకపోతోంది. ఉక్కిరిబిక్కిరయిపోతోంది.

ఇట్టే ఉరుములుకూడా వినిపించినాయి. తలపైకెత్తి చూసింది. తన ఆలోచనలన్నీకూడా ఆయనమీదే కేంద్రీకృతమయినాయి.

ఆయనింకా రాలేదేమిటా అని అనుకుంటూనేవుంది. వాకిట్లో ఆటో ఆగినట్టు చప్పుడయింది.

ఇట్టే రెండుకళ్లు వీధి గుమ్మంవైపు తిరిగినాయి.

ఆటోలోంచి దిగుతోంది ఆయనే, మూర్తిగారు, రమణమూర్తిగారు, వెంకటరమణమూర్తిగారు.

శాంతాదేవికి ముప్ఫయియేళ్ళక్రిందట మంగళసూత్రం కట్టింది యీయనే. ఆ బంధం యీనాటికీ చాలా పచ్చగా, తాజాగా కనిపిస్తూవుంటుంది. వాళ్ళిద్దరికీ ఒకే అదృష్టవంతుడు కలిగాడు.

ఆయన వాకిట్లోంచి గేటుతీసుకుని లోపలికి వస్తుంటే సరిగ్గా భానుమూర్తి వస్తున్నట్టే ఊహించింది. ఆ నడక, ఆ వురుకులూ, ఆ పరుగులూ, ఆటోవాడికి డబ్బిచ్చే పద్ధతి, ఇట్టే గిర్రున తిరగటం, తలపైకెత్తి చూడటం, అంతా తండ్రి పోలికే.

అట్టే ఆలోచిస్తూ తనను తాను మరిచేపోయింది. తన కొడుకు రూపమే కళ్ళ

ల్లోకి తెచ్చుకుని యేవేవో వూహల్లో నిలిచిపోయింది—

తీరా మూర్తిగారు దగ్గరకు వచ్చేటప్పటికి వులిక్కిపడింది పరాగ్గా.

నేను దయ్యాననుకున్నావా, భూతాన్ననుకున్నావా, అవి ఆయన అంటాడని ఆమెకు తెలుసు. ఆమె ఉలిక్కిపడటం ఆయన చూసినట్టు ఆమె గమనించింది.

అందుకనే 'మీరేలెండి, నేనింకోటేమీ అనుకోలేదు' అన్నది మెల్లిగా.

'ఇప్పుడు నేనేమన్నానని'అన్నట్టుగా ఆమె మొహంలోకి ఓసారి చూసి పైకీ క్రిందకు చూస్తూ, ఒక్కొక్క మెట్టే యెక్కుతూ లోపలికి చక్కాపొయ్యాడు.

ఆయన వెనకాలే ఆమెకూడా లోపలికి నడిచింది. ఆయన తెచ్చిన సంచీ ఖాళీచేసింది.

ఆయన కాళ్ళూ చేతులు కడుక్కుని ధోతీ మార్చుకుంటూ, ఏదో అడుగుదామనుకుని, తా నడగదలుచుకున్న ప్రశ్నకు తానే సమాధానం చెప్పుకుని మెదలకుండా వచ్చి వంటింట్లో పీటమీద కూర్చున్నాడు.

ఆయన కేవలం లాయరేకాదు. గొప్ప విమర్శకుడు కూడాను. ఎవర్నైనా ప్రశ్నవెయ్యదలుచుకుంటే, దానికి సమాధానం తనకు తెలుసేమో, ముందరగా ఆలోచించుకోవటం మంచిదంటాడు. సమాధానాలు తెలిసినపుడు ప్రశ్నలు వెయ్యటం శుద్ధదండగ అని ఆయన అభిప్రాయం. అయితే ప్రతి ప్రశ్నకు ఒకే సమాధానం వుంటుందని ఆయన అభిప్రాయం కాదు.

ఏ సమాధానం రాబట్టుకోవటానికి ఏ ప్రశ్న వెయ్యాలో ఆయనకు బాగా తెలుసు. మనుషుల్నిబట్టి సమాధానాలు వచ్చినట్టే, విచక్షణా జ్ఞానంతోనే ప్రశ్నలు వెయ్యాలని ఆయన ఉద్దేశం. వచ్చే సమాధానం నిక్కచ్చిగా తెలుసుకున్నప్పుడు అసలు ప్రశ్నవెయ్యకూడదని ఆయన నిశ్చితాభిప్రాయం. ఒక్కొక్కప్పుడు ఊహించలేని సమాధానాలు వస్తాయి. అందుకనే ప్రశ్నలు వేసేటప్పుడు ఎలాంటి సమాధానాలు వచ్చినా, తట్టుకునే స్తోమత, ధైర్యం వుండాలంటాడు. ప్రతి ప్రశ్నకు ఒక సమాధానం ఉండక్కర్లేదు, సమాధానంకోసం ప్రశ్నలు వెయ్యక్కర్లేదు. మాట ధోరణిలో మనకు కావలసిన విషయాలు అవతలవాళ్ళు చెప్పుతూవుంటారు. ఇక ప్రశ్నల ప్రమేయం ఉండదు. అసలు జీవితమే ఒక పెద్ద ప్రశ్నార్థకం! దీనికి అర్థం యేమిటీ అంటే యింతవరకు యెవ్వరూ చెప్పలేదు. ఇంకా ముందు చెప్పలేరుకూడా. ఎవరికి వారు తమ తమ అనుభవాల్లో యీ చిక్కు ప్రశ్నకు సమాధానం వెతుక్కోవాల్సిందే.

ఓసారి శాంతాదేవి అడిగిన చిన్న ప్రశ్నకు యింత పెద్ద సమాధానం చెప్పాడు,అప్పటినుంచి ఆమెకు హడలు భర్తను ఏమడగాలన్నా, ఏం రాద్ధాంతం తీసుకువస్తారో అని. ఆయనకూ అంతకంటె దడ. తాను ఏ ప్రశ్నవేస్తే, ఏం సమాధానం చెపుతుందో ఆమెగారని.

అందుకనే సాధ్యమైనంతవరకు యిద్దరూ మౌనంగానే వుండిపోతారు.

ఆయన గబగబ భోజనం కానిచ్చుకుని పడక్కుర్చీలో పడుకుని వక్కపలుకులు కటకటమనిపిస్తున్నాడు. ఆమె వంటిల్లు సర్దేసుకుని, సుందరాకాండ తీసుకుని వరండాలోకి వచ్చింది.

ఈవిధంగా యెన్నోరోజులు గడిచిపోతున్నాయి, కాని యీరోజే కాలం బద్ధకంగా నడుస్తున్నట్లు కనిపిస్తోంది.

ఆకాశం అంతా నల్లటిమేఘాలు తెల్లమేఘాలు ఘర్షణ పడటంతోనే సరిపోతోంది. సన్నగా తుంపరకూడా ప్రారంభమైంది. గాలిజోరు యింకా యెక్కువయినట్టే కనిపిస్తోంది. గబగబ చినుకులు పడుతున్నాయి. దబాటు వర్షానికి గభాలున శాంతాదేవి లోపలికి వచ్చేసింది.

మూర్తిగారు గది కిటికీతలుపులు వేసి వానజల్లును లోపలికిరాకుండా అరికట్టేశాడు.

ఆమె రావటంచూసికూడా గమనించనట్లుగానే, అతిశ్రద్ధగా ఏదో చదువుతున్నాడు. కాని పుస్తకంలో అక్షరాలు క్రిందకి పైకి ఊగుతున్నట్లు కనిపిస్తున్నాయి. కళ్ళద్దాలు తీసి గట్టిగా తుడిచి మళ్ళీ తగిలించుకున్నాడు.

ఆమెకూడా బింకంగానే పుస్తకంలోకే చూస్తూ కూర్చుంది. గోడ గడియారం గంటలు కొట్టటం ప్రారంభించింది. తొమ్మిదివాకా లెక్కపెట్టాడు. ఆమె పరధ్యాన్నంగా గదిలోంచి డైనింగ్ హాలులోకి తొంగిచూసింది. అప్పుడే తొమ్మిదయిందా అనుకుంది మనస్సులోనే.

చప్పున వాకిటిగేటు చప్పుడయినట్లు అలికిడయింది. గేటుతీసిన చప్పుడు కూడా స్పష్టంగానే వినిపించింది.

ఎవరొచ్చారబ్బా అనుకుంది.

ఇంతలోకి వాకిటి తలుపు చప్పుడయింది. ఎవరో తలుపు తడుతున్నట్టు స్పష్టంగా శాంతాదేవి గమనించింది.

గదిలో కూర్చున్న మూర్తిగారుకూడా గమనిస్తూనే వున్నారు.కాని ఆయన లేచి యివతలకు రాలేదు.

ఆమెమాత్రం ఎవరా అన్నట్లు ఆరాటంగా లేచి వాకిటివైపు వెళ్ళింది.

తలుపు మెల్లిగా కొడుతున్నట్టు చప్పుడవుతూనేవుంది. ఈసారి ఏదో సన్నటి గొంతుకకూడా వినిపించడం మూర్తిగార్నికూడా కలవరపెట్టింది. ఆయన మెల్లిగా లేచి గదితలుపు దగ్గర చెవిపెట్టి, నిలబడ్డాడు.

ఎవరో ఒక ఆడమనిషి తలుపు కొడుతున్నట్టు తెలుసుకున్నాడు. తానూ ముందుకువచ్చి, చప్పున ధీమాగా తలుపు తెరిచాడు.

ఒక స్త్రీ, భుజంమీద పసిపాపను పడుకోబెట్టుకుని చిచ్చికొడుతూ, ఏడుస్తున్నట్టు కనపడింది.

తలుపు తెరవంగానే ఆమె పక్కకు తప్పుకుంది. శాంతాదేవి ఆ అమ్మాయిని ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయింది.

'ఎవరు! ఎవరు !....మాట్లాడవే....' అంటూ కొంచెం దగ్గరగా వెళ్లాడు, ఆయన. ఆ అమ్మాయిని స్పష్టంగా చూశాడు. కాని తానెన్నడూ యిదివరకు చూసినవ్యక్తి కాదు.

'ఎవరు నువ్వు ! ఏంకావాలి ! ఎందుకొచ్చావ్ !....' ఈ ప్రశ్నలకు ఆయనకు సమాధానం దొరక్క అడిగేశాడు.

ఆమెదగ్గర్నుంచి సమాధానం లేకపోగా వెక్కివెక్కి ఏడవడం మొదలు పెట్టింది. ఆమె వానలో తడిసి ముద్దయింది. ఆమె గజగజలాడిపోతుంటే, మూర్తిగారి శరీరంలో వణుకువచ్చేసింది.

శాంతాదేవి నిబ్బరంగా అట్లాగే నిలబడిపోవడంచూసి, మూర్తిగారు మరింత గాభరాపడ్డాడు.

కాసేపటిదాక ఆమె నోటిమాటలేదు.

తమాయించుకుని, 'ఎవరు నువ్వు! మాట్లాడవే !' అని గట్టిగానే కోప్పడింది శాంతాదేవి, ఆయనవంక చూస్తూ.

ఆయన క్రమశిక్షణకు కట్టుబడ్డ మనిషి. అయితే ఆయన మానవతావాది కూడా. ఒక మనిషి కష్టాల్లో వుంటే చూసి భరించలేడు. మనస్ఫూర్తిగా అలాంటివాళ్ళకు ఎంతవరకైనా సహాయపడాలని మనస్సు ఉర్రూతలూగుతూ వుంటుంది. ఆయనకు యెంత పట్టుదలో అంత సడలింపుకూడా వుంది. ఈ రెండూకూడా యెప్పుడు యెక్కడ ప్రదర్శిస్తాడో యీ ముప్ఫయ్యేళ్ళ సాంసారిక జీవితంలో శాంతాదేవికే అర్థంకావటంలేదు.

ఓ మూల వానలో తడిసి బాధపడుతుంటే ఏమిటా గదమాయింపు ముందర లోపలికి రమ్మనరాదూ అని ఆయన ఉద్దేశమైనా పైకి అనటం ఆయనకు ఇష్టంలేదు. కాని యీ ముక్క శాంతాదేవి అంటేమాత్రం ఆయన హర్షిస్తాడు. అయితే శాంతాదేవి తటపటాయిస్తోంది, ఆయనేమంటారో అని.

భార్యవైపు చూశాడు. ఆయన కళ్ళల్లో జాలి, సానుభూతి ఉట్టిపడుతున్నాయి. అయినా ఆమె సాహసించలేదు.

ఆనాడు తాను చొరవతీసుకుని అన్నందుకే యింత శిక్ష విధించారు. తన కొడుకును తన కళ్ళముందు లేకుండా చేశారు. ఆ బాధతోనే కుమిలిపోతోంది. పెద్దగా నిట్టూర్చింది. ప్రతిక్షణంలోనూ భానుమూర్తి ఆమె కన్నుల్లోకి వచ్చి కూర్చుంటాడు. ఆ బరువుకు కళ్ళు చెమ్మగిల్లుతూనే వుంటాయి. ఆయన ముందు ఏమాటంటానికి భయం. వాడు అంతకంటేను ఒక్క ఉత్తరంముక్క రాయకూడదా, ఓసారి వచ్చి తొంగిచూసిపోరాదా. ఆ తండ్రికి తగ్గ కొడుకే! ఎందుకొచ్చిన పట్టుదలలు. అవన్నీ గుర్తుకొచ్చి ఆమె మనస్సు తెగ కలవరపడిపోతోంది.

'లోపలికి రమ్మనవే....'

'ఆ ముక్క మీరనరాదేమిటి !'

'ఎవరంటే యేముంది....'

'అసలు యెవరో కనుక్కోండి ముందర....లోపలికి రమ్మనటం మాట తర్వాత చూద్దాం....'

'నువ్వడుగు....'

వీళ్ళిద్దరు ఎవరి మనస్సులో వాళ్ళు అనుకుంటూ నిలబడిపోయారు. ఆ అమ్మాయికూడా వింతగా వీళ్ళిద్దరివంక చూస్తోంది ఆశ్చర్యంగా. వీళ్ళిద్దరూ కూడా ఎవరికివారు మనస్సుల్లో మహాఘర్షణపడుతున్నారు. ఈ అమ్మాయిని బైటకు వెళ్ళిపొమ్మనటమా, లోపలికిరమ్మనటమా. అనితీవ్రంగామధనపడుతున్నారు.



ఒకవేళ లోపలికి రమ్మనాలంటే ఎవరనాలి!

వీళ్ళిద్దరూ మౌనంగా పడుతున్న వేదన కనిపెట్టిందోయేమొ, ఆ అమ్మాయి చొరవతీసుకుని అమాంతం ఒక్క అంగలో లోపలికి వచ్చేసింది. బిడియంగానూ, భయంగానూ నిలబడింది.

శాంతాదేవి మొహంలోకి కోపంగా మూర్తిగారు చూస్తే, ఆయన కళ్ళల్లోకి ఆమెకూడా తీవ్రంగానే చూసింది.

ఎట్లాగయితేనే, ఆ అమ్మాయి యీ పరిస్థితుల్లో లోపలికి రావటం మంచిదేనని యిద్దరూ సమాధాన పడ్డారు.

'లోపలికి రమ్మన్నావు బాగానేవుంది. నీ చీర ఒకటిచ్చి బట్టలు మార్చుకోమనరాదూ. తడిసినబట్టలతో యెంతసేపు అట్లా నిలబడుతుంది....' మూర్తిగారు అప్రయత్నంగా అనేశాడు.

'అయితే నే రమ్మన్నానా ....' శాంతాదేవికూడా ఆ మాటలతీరులో తన సానుభూతిని స్పష్టంగా ప్రకటించింది.

'నేనా రమ్మన్నది....' మూర్తిగారు చిరాకుపడ్డట్టు ప్రవర్తించాడు.

'సరేలెండి మీరు చీరయివ్వమంటున్నారుగా, యిస్తాలెండి....' అన్నది, ఆ అమ్మాయివంక ఆప్యాయంగా చూస్తూ.

ఆయన తత్తరపడిపోయి 'సరే నీ యిష్టంవచ్చినట్టు చెయ్యి' అన్నాడు.

కాలం మెల్లిగా కదిలిపోతోంది. ఆ అమ్మాయి తాపీగా కూర్చుని తన గోడును చాలా విషాదంగా చెప్తూపోతోంది. ఆయనెంతో ఆసక్తిగానూ, ఆమెయెంతో కుతూహలంగానూ వింటూ కూర్చున్నారు.

'ఇప్పుడతను యెక్కడున్నాడు....' మూర్తిగారు ఆవేశంగా అడిగాడు.

బొంబాయిలోనే...గద్గదంగా చెప్పింది సమాధానం.

'రాస్కెల్ ....' మూర్తిగారికి .... ఆవేశం యెక్కువయింది. శాంతాదేవికి ఆలోచన యెక్కువయింది.

'లా' ప్రకారం రెండోపెళ్ళి చేసుకోవటానికి వీల్లేదు....' మూర్తిగారు ఘంటాపథంగా చెప్పేశాడు.

'నువ్వూహించుకుంటున్నావా........ నిజంగా అతను యెవర్నైనా పెళ్ళి చేసుకున్నాడా!....' శాంతాదేవి తికమక ప్రశ్నకు ఆ అమ్మాయి యేమీ సమాధానం చెప్పలేకపోయింది.

'నన్నింకేమీ అడక్కండి....నేనేమీ చెప్పలేను....నేనీ పిల్లాడికోసమే బతికున్నా. లేకపోతే నేను ఎప్పుడో రైలు క్రింద పడిపోయేదాన్నే! ఎక్కడా దిక్కుతోచక తిరుగుతుంటే మీ గుమ్మంచూసి గభాలున యిక్కడకు వచ్చేశా. భగవంతుడు నన్నిక్కడికి తీసుకువచ్చాడు. నాకు మీరీ ఒక్క సహాయం చెయ్యండి.... ఈ పిల్లాన్ని మీదగ్గరుంచండి. మీదగ్గరుంటే నా ప్రాణం కుదుటపడుతుంది. తర్వాత నేనేమైనా సరే నాకేం దిగుల్లేదు....' అంటూ ఒళ్ళోపడుకున్న పిల్లాన్ని అమాంతం శాంతాదేవికి అప్పగించింది.

మూర్తిగారి కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. బింకంగా ఉండిపోయాడు. శాంతాదేవికి ఆ నిబ్బరం లేకపోయింది.

'అ.... మ్మాయి .... నువ్వేం భయపడకు....అధైర్యపడద్దు .... అతనెక్కడుంటాడో, అతని తల్లిదండ్రులెవ్వరో నాకు పూర్తి అడ్రసు యిచ్చేసెయ్యి, నేను వాళ్ళపని పడ్తాను....' చాలా ధీమాగా అన్నాడు.

'అమ్మో ఆయన తలుచుకుంటే సాధించలేని పనిలేదు!! మహా పట్టుదల మనిషి. ఆయన చెప్పినట్టే చెయ్యమ్మా.' శాంతాదేవి వత్తాసు పలికింది.

ఆయన సగర్వంగా, శాంతాదేవి మొహంలోకి చూశాడు.

'....వద్దు....వద్దండీ....మీకు తెలీదు మా మామగార్కి మాటపట్టింపు చాలా యెక్కువ. వారితో వాదించి మీరు గెలవలేరు. వారికి వ్యతిరేకంగా యెవరైనా మాట్లాడితే సహించి వూర్కోరు. తీరా మీరు అక్కడికివెళ్ళితే ఏమిఘర్షణ పడతారో, ఏవిధంగా పరిణమిస్తుందో అని నాకు చాలా భయంగావుంది. మీరు మాత్రం అలాంటి సాహసం ఏమీ చెయ్యకండి. నా అదృష్టం ఎలావుంటే అలా జరుగుతుంది....' గొంతులో గీర వచ్చింది.



'మీ మామగారు యెలాంటివారో నాకు తెలీదుగాని, యీయనమాత్రం సామాన్యులుకాదు. ఈయన పట్టుదలకు తిరుగులేదు, ఎందుకన్నారో యేమొ, మళ్ళీ మీ యిద్దర్నీ దగ్గరకు చేరుస్తానని, ఆ పని చే సి తీ రు తా రు. ఇందులో సందేహం యేమీలేదు. నువ్వు అడ్రసు యివ్వమ్మా. భయపడక....' శాంతాదేవి ఆ అమ్మాయికి ధైర్యంచెప్పింది.

'అదికాదండీ .మా మామగారు నిజానికి చాలామంచివారు. సుతిమెత్తని మనసు. కోపంలో ఏదో అనేశారంటే అదంతే. తన పట్టుదల నెగ్గాలని యెంతకైనా తెగిస్తారు. అసలు ఆయనకు కోపం తెప్పించకుండా వుండాలి. ఏంలాభం, మావారికి ముక్కుమీదకోపం. వాళ్ళిద్దరి మధ్య నే నలిగిపోయాను. మీరెంత చెప్పినా నాకు ధైర్యం చాలటంలేదు. దయచేసి మా మామగారి దగ్గరకు వెళ్ళే ప్రయత్నం విరమించుకోండి. నాకు యీ ఒక్క సహాయం చేసిపెట్టండి చాలు. ఈ పిల్లాన్ని మీదగ్గరుంచుకోండి. అంతే నాక్కావాల్సింది.నేను యీ జన్మలో యీ మేలు మరవను....' ప్రాధేయంగా అడిగింది కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ.

పాపాయి బోసినవ్వులు కురిపిస్తున్నాడు. శాంతాదేవి, మూర్తిగారు విస్తుపోయి ఆ పిల్లాడివంక చూస్తూ తమను తాము మరిచిపోయారు.

భళ్ళున తెల్లారింది.

మూర్తిగారికి మతిపోయింది. ఆ అమ్మాయి యింట్లోలేదు. శాంతాదేవి తత్తర బిత్తరగా యిళ్ళంతా చూసి యెక్కడా లేదండీ అన్నది ఆవేశంగా. పసిపిల్లాడు చేతులూ కాళ్లూ వూపుతూ కక్కటిల్లి ఏడుస్తున్నాడు. శాంతాదేవికి యేమీతోచటంలేదు, ఏంచెయ్యాలో అర్థం కావటంలేదు. అంతా అయోమయంగా వుంది.

'ఈ పిల్లాన్ని యిట్లా వదిలిపెట్టి పోవటమేమిటి! ఎంత సాహసంచేసింది. ఈ పిల్ల సామాన్యురాలుకాదు....' శాంతాదేవి తనలో తాను ఆశ్చర్యపడి పోతోంది.

మూర్తిగారు ఓ క్షణంపాటు బిత్తర పోయాడు. మళ్ళీ 'ధైర్యాన్ని పుంజుకుని ఆ అమ్మాయి యెక్కడికి వెళుతుంది. ఎక్కడున్నాసరే పట్టుకొస్తాను. అసలు వీళ్ళంతేమిటో తేల్చుకుంటాను....' అంటూ ఉత్తరీయాన్ని గభాలున భుజానవేసుకుని ఓ గొడుగు చేత్తోపట్టుకుని అమాంతం వాకిట్లోకి ఓ అంగ వేశాడు.

శాంతాదేవి హడలిపోతూ ఆ ఏడుస్తున్న పిల్లాన్ని చేతుల్లోకి తీసుకుంది.

ఆ క్షణంలో ఆమె ఆలోచనలన్నీ భానుమూర్తిమీదికే మళ్ళినాయి.

'పోనీ చిన్నతనంచేత ఏదో తెలిసీ తెలీకండా చేశాడు. మరి తాను! పేరు మోసిన లాయరు. పదిమందికి చెప్పదగినవారు.మంచీ చెడూ తెలుసుకోగలిగిన వారు. పట్టుదలలకుకూడా అర్థంవుండాలి. దీన్ని పట్టుదల అనరు. మూర్ఖత్వం, మొండితనం అంటారు. ఉన్న ఒక్క కొడుకును దూరంచేసుకుని యిక్కడ యేం బావుకుంటున్నామని, ఏం సాధించామని తెలివితేటలుంటే మాత్రం యేం ప్రయోజనం. అవి మనకు ఉపయోగపడాలికదా! అంతా దైవచిత్రం. నా కొడుకు నాకు దూరమయిపోవటం, ఎవరో దారేపొయ్యే పిల్లాడు నా ఒళ్ళోకి రావటమా! ఇదంతా తలుచుకుంటే ఆశ్చర్యంగావుంది. తీరా ఆ అమ్మాయి కనిపించకపోతే యేంచేసేటట్టు. అసలు ఈయనిగార్కి ఉద్రేకం, కోపం ఎక్కువ! ఇప్పుడు యెక్కడికెళ్ళారో, ఏ అఘాయిత్యం చేస్తారో, కొంపమీదికి యేంతెస్తారో! యేదొచ్చినా వీరితో యిదే తంటా....నీకేం నాయనా మహారాజులా పడుకున్నావు నోట్లో వేలేసుకుని.... తపనగ ఆలోచిస్తూ శాంతాదేవి పిల్లాడి వంక చూసింది.

పిల్లాడు కిలకిల నవ్వుతున్నాడు. ఆ పిల్లాన్ని చూస్తుంటే శాంతాదేవి మొహం కూడా యిట్టే విప్పారింది.

వాకిట్లోకి స్పీడుగా ఆటోవచ్చి అమాంతం ఆగిపోయింది. శాంతాదేవి అదుర్దాగా లేచి రెండడుగులు ముందుకు వేసింది. ఆమె కళ్ళు జిగేలుమన్నాయి. పిల్లాన్ని గబగబ గదిలో మంచంమీద పడుకోపెట్టి తలుపుదగ్గరకేసి వాకిట్లోకి వచ్చింది.

ఆటోలోంచి భానుమూర్తి దిగుతుంటే అచ్చంగా తండ్రి దిగుతున్నట్టే అనిపించింది. ఆ వాలకం, ఆ ఆటో వాడికి డబ్బులిచ్చేపద్ధతి, గిర్రున తిరిగి లోపలికిరావటం, గేటుతలుపు తియ్యటం అంతా తండ్రే. తనకళ్ళను తాను నమ్మలేకపోయింది.

'అమ్మా' అంటూ భానుమూర్తి తల్లిదగ్గరకు వచ్చేశాడు. ఆమె ఒళ్లు ఝల్లుమన్నది.

'ఎక్కడినుంచి వస్తున్నావు....అంత గాభరాపడుతున్నావేంటి? ఏ మి టి నాయనా....' ఇంకా యేదో అడగబోయి మాట పైకిరాక మూగదయిపోయింది శాంతాదేవి.

'నాన్న ఉన్నాడా లోపల....' గుండె మీద చెయ్యిపెట్టుకుని భానుమూర్తి నివ్వెరపోయాడు.

'ఏమిట్రా! ఏమయింది....'

ఇల్లంతా ఒక్కసారి కలయచూశాడు.

'ఎక్కడికి వెళ్ళాడు....'

'ఇంటో లేర్లే ....ఏమిటి చెప్పు....'

'నే మోసపోయానమ్మా .... ఈ ఏడాది ఎట్లా గడిపానో, ఎంత టెన్షన్లో వున్నానో నీకేంతెలుసు....కాని అది

చెప్పినమాటలన్నీ ఒట్టి బూటకమని యిప్పుడు తెలుసుకున్నాను .... ఏం లాభం. చెయ్యిజారిపోయింది....ఇంకా నేను నాన్న మొహం చూడలేను....' ఉద్రిక్తపడుతున్నాడు. గిరగిర తిరిగి పోతున్నాడు.

'ఏమయిందీ!....' గట్టిగా అరిచింది శాంతాదేవి.

కళ్ళు అప్పగించి ఒక్క క్షణం నిలకడగా నిలబడిపోయాడుభానుమూర్తి, తల్లివైపుచూస్తూ.

అతనినోట మాట రావడంలేదు. మరీ నొక్కి నొక్కి తల్లి అడుగుతోంది ఏమయిందేమిటంటూ.

పక్కకు పిలిచి, మెల్లిగా తల్లితో చెపుతూ పోతున్నాడు.

'ఆఁ .... అంతపని చేసిందా... ' విస్తూరపోయింది శాంతాదేవి.

'నాన్నొస్తున్నట్టున్నాడు....'వెనక్కు తిరిగాడు.

'కాదులే....ఈ విషయం నాన్నకు తెలీకూడదు....'

'తెలీకుండా ఎట్లా దాస్తాంరా....'

'అందుకనేగా నేవిక్కడికి వచ్చింది....'

'ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు ....'

'నాకు యేమీ తోచటంలా....అ గదిలో యేమిటి చప్పుడు....' విసురున గదితలుపు గొళ్ళెం తియ్యబోయాడు.

శాంతాదేవి వద్దు వద్దు అంటూ వారించింది.

'ఆ పిల్లాడేడుపేమిటి....భానుమూర్తి గభాలున గొళ్ళెంతీసి గదిలో అడుగు పెట్టాడో లేదో, వాకిట్లోంచి మూర్తిగారు లోపలికి వస్తున్నారు.

'అమ్మా' అంటూ పెద్దపెట్టున కేక పెట్టాడు.

'నాన్నొస్తున్నారు....' గదితలుపేసి గొళ్ళెం పెట్టేసింది శాంతాదేవి.







నీరసంగా వచ్చి దిగాలుపడి కుర్చీలో కూలబడ్డాడు మూర్తిగారు.

'ఆ అమ్మాయి యెక్కడా కనిపించ లేదు....' మెల్లిగా అన్నాడు.

ఆమె విలవిలలాడిపోతోంది.

తన వెనకాలే అడుగులచప్పుడు విని నిర్ఘాంతపోయింది. శాంతాదేవి యిట్టే వెనక్కు తిరిగింది.

తలవంచుకుని, నుదురుమీద చెయ్యి పెట్టుకుని కుర్చీలో చేరగిలపడ్డ భర్త వైపు ఒక్క క్షణంచూసి, మళ్ళీ ఆ అమ్మాయివైపు తిరిగి 'నువ్విక్కడే వున్నావా....'అన్నది ఉద్వేగంగా.

మూర్తిగారు చప్పున తల పైకెత్తి చూసి 'ఆఁ....' అంటూ దిగ్భ్రాంతిగా లేచి నిలబడ్డాడు.

'....నేను యిల్లోంచిలేచిపోలేదండి. చెయ్యకూడని పని చెయ్యలేదు. రాకూడనిచోటుకు రాలేదు....'అంటూ యేదో చెప్పబోతుంటే, శాంతాదేవి తత్తరపడి పోతూ 'నువ్వా!....' అన్నది....

....అవును నేనేనండి....నేనే.... గద్గదంగా అంటూనే దగ్గరకు వచ్చేసి శాంతాదేవి ఒళ్ళో తలపెట్టి వెక్కివెక్కి ఏడుస్తోంది.

'ఒరేయ్ అబ్బాయి....' పెద్దగా పిలుస్తూ గదితలుపు గొళ్ళెంతీసింది.

పిల్లాన్ని భుజంమీద పడుకోపెట్టుకుని భానుమూర్తి కదలక మెదలక గదిలో అట్లాగే నిలబడిపోయాడు, నోరు తెరుచుకుని.

శాంతాదేవికి యెక్కడలేని ధైర్యం వచ్చింది.

'ఇప్పుడేనా తెలుసుకున్నారా మన ప్రయోజకత్వం యేమిటో....' చాలా హుందాగా అనేసింది శాంతాదేవి.

'మామగారూ క్షమించండి...'వసంత మూర్తిగారి పాదాలు తాకటానికి వంగింది.

ఆయన తలవంచుకునే వున్నాడు.

———